ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

మంగళవారం 2 జూలై 2024 | 5





నువ్వు చల్లగుండాలయ్యా: వృద్ధురాలి ఆశీర్వాదం

పింఛన్.. ఆనందించెన్..

	తూర్పుగోదావరి	అంబేడ్కర్ కోనసీమ	కాకినాడ
లబ్ధిదారులు :	2,41,771	2,43,534	2,79,319
అందుకున్నవారు :	2,32,840	2,33,944	2,62,423
మొత్తం శాతం :	96.31	96.06	93.95





అల్లవరం మండలం డి.రావులపాలెంలో ఎమ్మెల్యే ఆనందరావు



కొత్తపేటలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



ఐ.పోలవరం మండలం మురమళ్లలో ఎమ్మెల్యే బుచ్చిబాబు



మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యే వరప్రసాద్



మామిడికుదురు మండలం నగరంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



అమలాపురంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా

కూటమి తొలి అడుగే.. సూపర్‌హిట్

అమలాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో జిల్లా రికార్డు సృష్టించింది. కేవలం సగం మంది సిబ్బందితోనే తొలిరోజే అత్యధికంగా 96.06 శాతం పెన్షన్లు అందజేశారు. ఇందుకు కలెక్టర్ హిమాన్షు శుక్లాతో పాటు డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ విశేషంగా కృషి చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే వృద్ధాప్య పెన్షన్‌ను రూ.3వేలునుంచి రూ.4వేలకు పెంచడంతో పాటు గత మూడు నెలలకు సంబంధించి రూ.3వేలుతో కలిసి ఒక్కొక్కరికీ రూ.7వేలుచొప్పున పంపిణీ చేయడంతో వృద్ధుల ఆనందానికి అవధుల్లేవు. సచివాలయ సిబ్బంది 3,897 మంది, ఇతర సిబ్బంది 350 మంది పెన్షన్ల పంపిణీ చేపట్టారు. వాడవాడలా పండుగ వాతావరణంలో పెన్షన్లు పంపిణీ చేశారు. అమలాపురం పట్టణంలోని 29వ వార్డు విద్యుత్ నగర్‌లో పెన్షన్ల పంపిణీని కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనరు ఎస్.మనోహర్ తదితరులు పాల్గొన్నారు. అమలాపురం, రాజోలు, పి.గన్నవరం, ముమ్మిడివరం, కొత్తపేట, మండపేట నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, దేవ వరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ, దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు), బండారు సత్యానందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు పెన్షన్లు పంపిణీ చేశారు. పలుచోట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకాలు నిర్వహించారు.

జిల్లాలో తొలిరోజు 96.06 శాతం పెన్షన్ల పంపిణీ

అమలాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ తొలిరోజు జిల్లాలో సోమవారం రాత్రి 10.55 గంటలకు 96.06 శాతం జరిగింది. అత్యధికంగా ముమ్మిడివరం నగర పంచాయతీలో 98.25 శాతం మందికి పెన్షన్లు పంపిణీ చేశారు. జిల్లాలో 2,43,534 మంది పెన్షన్‌దారులు ఉండగా 2,33,944 మందికి పెన్షన్ల బట్వాడా పూర్తి చేశారు. పెన్షన్‌దారులకు రూ.160,89,88,000 నగదును పంపిణీ చేయాల్సి ఉండగా రూ.154,52,24,500 పంపిణీ పూర్తి చేసినట్టు డీఆర్డీఏ పీడీ శివశంకరప్రసాద్ తెలిపారు. మండలాల వారీగా... రాజోలు 97.37 శాతం, అమలాపురం అర్బన్ 97.32, రామచంద్రపురం అర్బన్ 97.31, అల్లవరం 97.04, మలికిపురం 97.02, ముమ్మిడివరం 96.71, మండపేట అర్బన్ 96.67, రావులపాలెం 96.52, రామచంద్రపురం 96.51, సఖినేటిపల్లి 96.48, మామిడికుదురు 96.43, అయినవిల్లి 96.42, అంబాజీపేట 96.32, ఆత్రేయపురం 96, రాయవరం 95.86, ఆలమూరు 95.63, పి.గన్నవరం 95.49, అమలాపురం 95.42, కపిలేశ్వరపురం 95.31, ఐ.పోలవరం 95.3, ఉప్పలగుప్తం 95.08, మండపేట 94.94. కె.గంగవరం 94.55, కాట్రేనికోన 94.32, కొత్తపేట 94.16.

పింఛనుదారుల కళ్లల్లో ఆనందం చూశాం

- ప్రజల ఆశయాలు, ఆకాంక్షలను నెరవేరుస్తాం
- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



కె.గంగవరం మండలం పాణింగపల్లిలో మంచానికే పరిమితమైన మేడిశెట్టి అప్పారావుకు రూ.15వేలు పింఛను అందజేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూలై 1: ప్రజలు ఏ ఆశయం, ఆకాంక్షతో కూటమికి ఓట్లు వేసి గెలిపించారో వాటిని నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన రామచంద్రపురం పట్టణంలోని కొత్తూరులో పలివెల ఉమాదేవి అనే దివ్యాంగురాలికి 'ఎన్టీఆర్ భరోసా' పింఛను అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ సొమ్మును రెట్టింపుచేసి రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేశామన్నారు. పింఛనుదారుల కళ్లల్లో ఆనందం చూశామని తెలిపారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్ నాయకత్వంలో ప్రజలు స్వర్ణాంధ్రప్రదేశ్‌ను చూస్తారన్నారు. ఇచ్చిన హామీలను అయిదేళ్లలో నెరవేర్చుతామన్నారు. 'నవరత్నాలు' పేరుతో లక్షలు ఇచ్చామని చెప్పుకుని ఓట్లు దండుకోవాలనే పిచ్చి ప్రయత్నంలో వైసీపీ ప్రభుత్వం ప్రజల జీవితాలు మార్చే, ప్రాణాలు నిలిపే ఎన్నో పథకాలను రద్దు చేసిందన్నారు. ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారంటే రాక్షస ప్రభుత్వాన్ని ఎంతగా చీదరించుకున్నారో అర్థమవుతోందన్నారు. రాష్ట్రంలో గంజాయి వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండే విధంగా పరిపాలన సాగిస్తామన్నారు. అంతకుముందు చంద్రబాబు చిత్రపటానికి మంత్రి సుభాష్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, మేడిశెట్టి శేషారావు, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కడియాల రాఘవన్, తెలుగు యువత నాయకుడు అక్కల రిష్వంత్‌రాయ్, గుణ్ణం వినోద్‌కుమార్, కొసనా శ్రీనివాస్, నందూరి ఫణికుమార్, రవ్వా భూషణం టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీ నెరవేర్చిన ప్రభుత్వం మాది

కె.గంగవరం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వృద్ధులకు రూ.7వేలు పింఛను ఇచ్చామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని పాణింగపల్లి గ్రామంలో ఆయన ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పంఛన్లు పంపిణీ చేశారు. తాటికొండ సూర్యనారాయణ, సమసిన రాముడులకు వృద్ధాప్య పింఛను కింద రూ.7వేలు చొప్పున, తిర్రి అబ్బారావుకు దివ్యాంగ పింఛను రూ.6వేలు, మేడిశెట్టి అప్పారావు (మంచానికే పరిమితమైన దివ్యాంగుడు)కు రూ.15వేలు అందజేశారు. తాతపూడి సురేష్ కుటుంబానికి చెందిన కవల పిల్లలకు రూ.3వేలు నగదు బహుమతిగా అందజేశారు.

గత వైసీపీ పాలనంతా అవినీతిమయమే అని వాసంశెట్టి సుభాష్ అన్నారు. పింఛన్ల పంపిణీ తర్వాత ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. గతంలో మంత్రిగా పనిచేసిన వారు చేసిన అవినీతిని వివరించారు. లబ్ధిదారుల ఎంపికలో స్థానిక నాయకులు చేసిన అవకతవకలను వివరించారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన కూటమి శ్రేణులకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణిసుబ్బారావు, ఎంపీడీవో ఎన్.శ్రీనివాసు, ఎంఈవో-2 చోడిశెట్టి ఆంజనేయులు, టీడీపీ నాయకులు కొత్తపల్లి మొరార్జీ, మరివాడ చిన్నికృష్ణ, బలుసు నాగేంద్ర, రవ్వా భూషణం తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతా

- పనిచేసే..మన్ననలను పొందుతా
- రక్షణ పేరుతో ఆంక్షలు వద్దు
- స్థలం చూస్తున్నా.. ఇల్లు కట్టుకుంటా
- ఉపాధిని మెరుగుపరుస్తా
- పింఛన్ల పంపిణీ సభలో పవన్

పిఠాపురం/గొల్లప్రోలు, జూలై 1: దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా పిఠాపురాన్ని తీర్చిదిద్దుతానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని సత్యకృష్ణ కల్యాణ మండపంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. పిఠాపురం నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించాల్సి ఉందన్నారు. కొత్తపల్లి మండలంలోని సముద్రపు తీర ప్రాంతాల్లో తాగునీటి కోసం అక్కడ మహిళలు పడుతున్న కష్టాలను తాను స్వయంగా చూశానని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు, కొత్తపల్లి, పిఠాపురం మండలాల్లోని కొన్ని గ్రామాలను ఎంపిక చేసి అక్కడ నూరుశాతం శానిటేషన్ చేయడంతో పాటు ఇంటింటికీ రక్షిత తాగునీరు అందించడం చేద్దామని భావిస్తున్నట్టు తెలిపారు. నా నియోజకవర్గంలో సక్సెస్ అయిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా అదే మోడల్‌లో శానిటేషన్ చేయిస్తా మన్నారు. ప్రజలను, పోలీసులను, అధికారులను ఇబ్బందులు పెట్టి విజయయాత్ర చేయాలనుకోలేదని, పనిచేసిన తర్వాతే తనకు విజయయాత్ర అని స్పష్టం చేశారు. పనిచేసి మన్ననలు పొందితేనే తనకు ఆనందం. అప్పుడే నేను ఎమ్మెల్యేను అయ్యాను అన్న ఆనందం కలుగుతుందని తెలిపారు. ఎక్స్‌పర్ట్‌లను తీసుకువచ్చి పిఠాపురానికి మేలు చేసే దిశగా అడుగులు వేస్తామని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గంలో 40,765 మందికి పింఛన్ల రూపేణా రూ.27.34 కోట్లు అందజేస్తున్నామని చెప్పారు. వారం విడిచి వారం ప్రతి సోమవారం జిల్లా కలెక్టరు ఇక్కడే ఉండి సమస్యలు పరిష్కరిస్తారని చెప్పినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. దివ్యాంగులకు 40 శాతం వికలాంగత్వం ఉంటేనే పింఛన్ అందుతోందని, ఇందులోనూ ఎన్నో సమస్యలు ఉన్నాయని, 90 శాతం ఉన్నవారికి సదరంలో సర్టిఫికెట్ రావడం లేదని, ఇటువంటి వాటిని సరి చేస్తామని ప్రకటించారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత తన మొదటి పర్యటన ఇదని పవన్‌కల్యాణ్ తెలిపారు. ఎన్నికల్లో గెలిచి ఊరేగింపు చేసుకోవడం నాకు ఇష్టం లేదు. పనిలోకి వెళ్లాలనుకున్నా. పింఛన్లు అందించి కృతజ్ఞతలు చెబుదామని భావించానని చెప్పారు. భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజల కోసం తక్కువ మాటలు చెప్పి ఎక్కువ పనిచేయాలన్నది నా భావన అన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్నాం. ఇది అసలైన ఛాలెంజ్ అని తెలిపారు. దివ్యాంగుల సమస్యలను జనవాణిలో విన్నా. నిజంగా గత ప్రభుత్వంలో అన్యాయానికి గురైన వారు ఉన్నారంటే దివ్యాంగులేనని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యమిస్తూ అందరిలో ఉన్న ప్రతిభ, సమర్థతను వెలికితీస్తామని తెలిపారు. అంతకుముందు వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం పవన్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు సగిల షాన్‌మోహన్, ఎస్పీ సతీష్‌కుమార్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీ ఎస్ఎన్ వర్మ, జనసేన, బీజేపీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, బుర్రా కృష్ణంరాజు పాల్గొన్నారు.



వెల్‌కమ్ సార్ : డిప్యూటీ సీఎం పవన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి దుర్గేష్. చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి



బిడ్డల భవిష్యత్ చూస్తున్నా: గొల్లప్రోలు సభలో పవన్

ప్రజలకు ఆంక్షలు పెట్టవద్దు...

ప్రజల దగ్గరకు వచ్చినప్పుడు దయచేసి రక్షణ పేరుతో ఆంక్షలు పెట్టవద్దని.. గతంలో జనవాణి, ఇతర సందర్భాల్లో ప్రజలను ఎలా కలుసుకునే వాడినో అలాగే కలుసుకోనివ్వాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పోలీసు యంత్రాంగానికి సూచించారు. సీఎం, డిప్యూటీ సీఎం అని నేనెప్పుడూ అనుకోలేదు. కష్టపడే వ్యక్తిగా ఈ స్థానంలో ఈ రోజున కూర్చున్నాను. మీరు వేసి ప్రతి ఓటు సరైన వ్యక్తికి, కూటమికి వేశామని గర్వపడే విధంగా తన పనితీరు ఉంటుందని పవన్‌కల్యాణ్ తెలిపారు. చక్రి అనే బాలుడిని వేదిక మీదకు పిలిపించుకుని ఇటువంటి బిడ్డల భవిష్యత్తు కోసం పనిచేస్తానని చెప్పారు. నా బిడ్డలు కోసం ఎంత తపన పడతానో తెలియదు కానీ ఇటువంటి బిడ్డల కోసం ఈ తరమే కాదు రానున్న రెండు తరాల కోసం పనిచేస్తానని తెలిపారు. ఇది టీడీపీ లీడ్ చేసే ప్రభుత్వం, జనసేన వెన్నుదన్నుగా నిలిచిన ప్రభుత్వం, ప్రధాని మోదీ, బీజేపీ పెద్దలు ఆశీస్సులు ఉన్న ప్రభుత్వమని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గ ప్రజలు రుణం తీర్చుకుంటానని పవన్ తెలిపారు.నియోజకవర్గంలో స్థలం కోసం చూస్తున్నానని.. సొంతింటిని కట్టుకుంటానని ప్రకటించారు. మీ అందరి మధ్యే ఉంటానని చెప్పారు.

మా జీవితాల్లో వెలుగు

ముమ్మిడివరం మండలం కొత్తలంక గ్రామానికి చెందిన కుచ్చర్లపాటి నరసింహరాజు ప్రమాదంలో గాయపడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆ గ్రామ వీహెచ్ఏ కాకినాడ వెళ్లి ఆయనకి పెన్షన్ ఇచ్చాడు.





వెదుళ్లపల్లి బాపిరాజు

అల్లవరం: చంద్రబాబు పాలనతో మా జీవితాల్లో వెలుగు వచ్చింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛనును రూ.3వేల నుంచి రూ.4వేలు చేశారు. చంద్రబాబు మా పాలిట దేవుడు. రూ.7వేల పింఛను తీసుకోవడం ఆనందంగా వుంది.



గుబ్బల అనంతలక్ష్మి



మోటూరి సత్యనారాయణ

ఆత్రేయపురం మండలం వద్దిపర్రు గ్రామానికి చెందిన పల్లికొండ గంగరాజు అనారోగ్యంతో రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సర్పంచ్ జుజ్జవరపు శ్యామలహరిబాబు చొరవతో వీఆర్వో వై.ఏలియా అక్కడకు వెళ్లి ఐసీయూలో వున్న గంగరాజుకు పింఛను సొమ్ము అందజేశాడు.



పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి: కలెక్టర్

అమలాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు పూర్తి భద్రత కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ మందిరంలో సోమవారం ఆయన అధికారులతో సమీక్షించారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలు లైంగిక వేధింపులకు గురికాకుండా వాటిని అరికట్టే దిశలో మహిళల రక్షణ కమిటీలు ఏర్పాటుచేసి నివేదిక అందించాలన్నారు. మహిళల భద్రత కోసం రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులు కల్పించారన్నారు. మహిళలు స్వేచ్ఛగా వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాలు నిర్వహించుకునేలాచూడాల్సిన బాధ్యత ఆయా వ్యవస్థలపై ఉందన్నారు. పనిచేసే ప్రదేశాల్లో అంతర్గత ఫిర్యాదు కమిటీలను ఏర్పాటు చేయాలనిసూచించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారిణి ఎం.ఝాన్సీరాణి మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రదేశంలో భద్రతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు నివేదిక అందించాల్సి ఉన్నందున తక్షణం కమిటీలను నియమించడంతో పాటు భద్రతకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించే బాధ్యతను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలకు అప్పగించామని చెప్పారు.

'ఉపాధి హామీ బకాయిలు వెంటనే విడుదల చేయాలి'

అమలాపురం టౌన్, జూలై 1:

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు బకాయిలు ఏడు వారాలుగా నిలిచిపోయాయని, వెంటనే విడుదల చేయాలని డిమాండు చేస్తూ సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లుకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరు కాగా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. వేతన బకాయిలు విడుదల చేయాలంటూ నినాదాలు చేశారు. ఉపాధి హామీని హార్టీకల్చర్‌కు అనుసంధానం చేయడంపై పునరాలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సకిలే సూర్యనారాయణ, నాయకులు పొలమూరి శ్రీనివాసరావు, పెట్టా ఆనందరావు, అనంతలక్ష్మి, వి.నాగదేవి, ఎం.విజయలక్ష్మి, ఐ.మంగాదేవి, ఎస్.నాగలక్ష్మి, టి.కృప తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 8 ఫిర్యాదులు

అమలాపురం టౌన్, జూలై 1:

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి ఎనిమిది ఫిర్యాదులు అందాయి. సివిల్, కుటుంబ కలహాలతో పాటు ఇతర ఫిర్యాదులను ఎస్పీ ఎస్.శ్రీధర్ స్వీకరించి వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.

ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించాలి

అమలాపురం టౌన్, జూలై 1: ప్రజా సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి నిబంధనలకు లోబడి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీ నుపూర్‌అజయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు అర్జీదారుల సమస్యలు విని 112 అర్జీలు స్వీకరించారు. జిల్లా స్థాయి అధికారులు తమ లాగిన్‌కు వచ్చిన ప్రతి అర్జీనీ క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో విచారించాలని కలెక్టర్ సూచించారు. నిర్దేశిత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని, గడువు దాటిన అర్జీలు లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి, డీఈవో ఎం.కమల కుమారి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్‌బాబు, పంచాయతీరాజ్ ఎస్ఈ కె.చంటిబాబు, సీపీవో వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, వ్యవసాయ శాఖ జేడీ ఓలేటి బోసుబాబు, డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీక్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మదన్‌మోహనరావు, పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు పీకేపీ ప్రసాద్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎ.పాపారావు పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

పింఛన్‌దారుల ఆనందం

వృద్ధుల కష్టాలు చంద్రన్నకు తెలుసు



వృద్ధాప్యం అనుభవిస్తూ పండుటాకుల్లా జీవిస్తున్న మా కష్టాలు చంద్రన్నకు తెలిసినట్టుగా ఎవరికీ తెలియవు. ఇంటికి పెద్ద కొడుకుగా ఉంటానని ఎవరూ పెంచనివిధంగా పింఛన్లు పెంచిన చంద్రన్నను గతంలో మోసగించాం. తప్పు తెలుకున్నాం. నాలుగు వేలకు పెంచిన పింఛనుతో ఆనందంగా జీవిస్తాం. పండుటాకులకు ఇంతకన్నా ఏంకావాలి చెప్పండి.

- సబ్బెళ్ళ సుబ్బయ్యమ్మ, లబ్ధిదారు, అనపర్తి

చేదోడు అయ్యింది..



చంద్రబాబు పెంచిన పింఛను నాకు ఎంతో చేదోడు అయ్యింది. నాకు మూడేళ్ల కిందట ప్రమాదంలో రెండు కాళ్ల దెబ్బతిని ఆపరేషన్లు అయ్యాయి. ఇప్పటికీ ఏ పనీ చేయలేకపోతున్నా. నాకు ఈ పింఛనే ఆధారం.

తుట్టా లక్ష్మీనారాయణ, దివ్యాంగుడు, బిక్కవోలు

సంతోషంగా ఉంది..



చాలా సంతోషంగా ఉంది. ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబునాయుడు పింఛను పెంచారు. ఏప్రిల్ నుంచి పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు 3 వేలు కూడా కలిపి రూ.7 వేలు పింఛను తీసుకోవడం ఆనందంగా ఉంది.

వేళంగి గౌరమ్మ, కడియం

బాబుకు కృతజ్ఞతలు



పింఛను రూ.3 వేల నుంచి నాలుగు వేలకు పెంచినందుకు ఎంతో ఆనందంగా ఉంది. దీంతోపాటు ఏప్రిల్ నెల నుంచే పెంచిన మొత్తాన్ని కలిపి మొత్తం రూ.7 వేలు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది. చంద్రబాబుకు కృతజ్ఞతలు.

బత్తిన మార్తమ్మ, వడిశలేరు, రంగంపేట మండలం

చేయూత అందింది



చాలా ఆనందంగా ఉంది. నాకు కాలుకు ఇబ్బంది వచ్చి ఆపరేషన్ చేయించుకున్నా. అప్పులపాల య్యాం. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ప్రయత్నించినా గత ప్రభుత్వంలో మాకు ఏ పని అవ్వలేదు. ఇప్పుడు పింఛను పెంచి ఇవ్వడంతో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం వచ్చింది. చంద్రబాబు అండగా నిలబడ్డారు..

- జొన్నాడ సూరమ్మ, సీతానగరం

- అనపర్తి/ బిక్కవోలు/కడియం/రంగంపేట/సీతానగరం

నిత్యాన్నదానానికి రూ.లక్ష



విరాళం అందిస్తున్న దాతలు

అన్నవరం, జూలై 1: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి సోమవారం రామచంద్రపురానికి చెందిన కొత్తపల్లి రామకృష్ణ, వరలక్ష్మి దంపతులు లక్ష రూపాయలు దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను అభినందించి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

చీఫ్ ఇంజనీర్‌గా వాసుదేవరావు



మోతుగూడెం, జూలై 1: సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్‌గా వాసుదేవరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కాంప్లెక్సు పరిధిలోని మూడు జల విద్యుత్ కేంద్రాల ఇంజనీర్లు నూతన సీఈ వాసుదేవరావుకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జెన్‌కో ఉద్యోగ సంఘాల నాయకులు పలువురు సీఈని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఇంజనీర్లతో సమావేశమై కాంప్లెక్సు పరిధిలోని విద్యుత్ ఉత్పత్తి, యూనిట్ల పనితీరుపై నీటి నిల్వలు తదితర అంశాలపై చర్చించారు.

ఐటీఐలో ప్రవేశానికి ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ), జూలై 1: కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో, జగ్గంపేటలో ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐలో రెండో విడత ప్రవేశానికి ఈనెల 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు.

4న ఐటీఐలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 1: కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 4న క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎంజీవీ వర్మ తెలిపారు. ఐటీఐ ఫైనల్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు 350 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు వివరించారు.

డిప్యూటీ సీఎం పవన్‌కు ఘన స్వాగతం



గౌరవ వందనం స్వీకరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



సత్యనారాయణస్వామి చిత్రపటాన్ని అందిస్తున్న రత్నగిరి ఈవో, చైర్మన్

పోలీసుల గౌరవ వందనం

పూల కార్పెట్‌పై నడిచేందుకు పవన్ నిరాకరణ

అభినందనలు తెలిపిన కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, జూలై 1: రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి కాకినాడ జిల్లాకు వచ్చిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు సోమవారం ఘనస్వాగతం లభించింది. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి నేరుగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులో గల తన నివాసానికి చేరుకున్నారు. అక్కడ పోలీసులు నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పవన్‌కు జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, ఎస్పీ సతీష్‌కుమార్, జాయింట్ కలెక్టరు రామసుందరరెడ్డి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.భరణి తదితరులు స్వాగతం పలికారు. అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో రామచంద్రమోహన్‌లు పవన్‌ను శేషవస్త్రాలతో సత్కరించి సత్యదేవుని ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. పవన్ వస్తున్నారనే సమాచారం తెలియడంతో భారీగా జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. కాగా పవన్ తన నివాసంలోకి వెళ్లే దారిలో గులాబి పువ్వులను కార్పెట్‌లా పరిచారు. దానిపై నడిచేందుకు పవన్ సున్నితంగా తిరస్కరించి పక్క నుంచి నడిచి నివాసంలోకి వెళ్లారు. చేబ్రోలు నివాసం వద్ద పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, ఆయన తనయుడు గిరీష్ పవన్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వర్మను పవన్ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గంతో పాటు వివిధ ప్రాంతాలు నుంచి తరలివచ్చే ప్రజలు ఇచ్చే వినతులను స్వీకరించేందుకు చేబ్రోలు నివాసం వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. జనవాణి పేరుతో వినతులు స్వీకరించి వారి సమస్యలను కౌంటర్‌లోని సిబ్బంది అడిగి తెలుసుకుంటున్నారు.

విమానాశ్రయంలో ఘన స్వాగతం



పవన్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్పీ జగదీశ్ తదితరులు

కోరుకొండ, జూలై1: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సోమవారం మధురపూడి విమానాశ్రయానికి విచ్చేసిన సందర్భంలో ఆయనకు విమానాశ్రయం వద్ద మంత్రి దుర్గేష్, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ జగదీష్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మెల్యేలు ఘనంగా స్వాగతం పలికారు. తూర్పుగోదావరి జిల్లా కొత్త కలెక్టర్ పి.ప్రశాంతి పవన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని బహూకరించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి కూడా పవన్‌కు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పిఠాపురం బయల్దేరి వెళ్లారు.



మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తా

మీరిచ్చిన బలం రాష్ట్రమంతా తిరిగేలా చేసింది

జనసైనికులు, వీరమహిళల సమావేశంలో జనసేనాని పవన్‌కల్యాణ్

పిఠాపురం/గొల్లప్రోలు, జూలై 1: ఆఖరి శ్వాస వరకూ ప్రజల అభ్యున్నతి కోసం పనిచేస్తానని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. గొల్లప్రోలు పట్టణంలోని సత్యకృష్ణ ఫంక్షన్ హాలులో సోమవారం సాయంత్రం జరిగిన పిఠాపురం నియోజకవర్గ జనసైనికులు, వీరమహిళల సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. సుమారు గంటన్నర పాటు వారితో మాట్లాడారు. పీఠికాపురాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడదామన్నారు. పిఠాపురంలో మీరిచ్చిన బలం రాష్ట్రం అంతా తిరిగేలా చేసిందని చెప్పారు. తనకు పదవులపై వ్యామోహం లేదన్నారు. ఎన్నికల ఫలితాల సమయంలో పిఠాపురం తనను గెలిపిస్తుందా లేదా, అన్ని స్థానాలు గెలుస్తామా లేదా అని ఆలోచన ఉండేది కాని మనస్సులో మాత్రం మనం ఘన విజయం సాధించబోతున్నామని ధీమా ఉందని అన్నారు. అందుకే టీవీలు చూడలేదు. గెలుపు తర్వాత వచ్చి చెవిలో చెప్పమన్నా అని వివరించారు. గెలిచిన తర్వాత నియోజకవర్గానికి వచ్చేద్దాం. తిరిగేద్దాం. గజమాలలు వేయించుకుందామనే ఉబలాటం కలిగిందని, అయితే మనస్సు మాత్రం ఇంత ఘనమైన విజయం అందించిన వారి కోసం ఒక కూలీలా కష్టపడి పనిచేసి గతంలో ఎవ్వరు చేయని విధంగా పిఠాపురాన్ని అభివృద్ధి చేసి చూపించాలని సూచించిందని తెలిపారు. పిఠాపురానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చి ప్రపంచదేశాలన్ని ఇటువైపు చూసేలా చేస్తానని చెప్పారు. పిఠాపురాన్ని టెంపుల్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డును సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. తన శాఖలపై ప్రజలు నుంచి అభిప్రాయాలు కోరితే ఒక్క పిఠాపురం నియోజకవర్గం నుంచే 1424 ఇన్‌పుట్స్ వచ్చాయని చెప్పారు. ఇందులో దుర్గాడ, ఉప్పాడ తదితర గ్రామాలు నుంచి విలువైన సూచనలు వచ్చాయని తెలిపారు. తన కోసం, జనసేన విజయం కోసం దేశ, విదేశాలు నుంచి జనసైనికులు, వీరమహిళలు వచ్చి పనిచేశారని, ఒకరైతే ప్రాణాలు కోల్పోయారని పవన్ తెలిపారు. ఆస్ట్రేలియా నుంచి ఒకరు వచ్చి ఆరునెలలు ఇక్కడ పనిచేశారని, బజ్జీలు అమ్ముకనే వ్యక్తి తన సంపాదనలో కొంతభాగాన్ని జనసేనకు విరాళం ఇచ్చారని, ఎండలో మలమల మాడుతూ ప్రచారం నిర్వహించారని, ఇవన్ని గుర్తుకు వస్తుంటే కన్నీళ్లు తిరుగుతున్నాయని, ఏమిచ్చి వీరి రుణం తీర్చుకోగలనని ఆయన అన్నారు.

పిఠాపురాన్ని వదిలి ఎక్కడకీ వెళ్లను

పిఠాపురాన్ని వదలి తాను ఎక్కడకు వెళ్లను అని పవన్ స్పష్టం చేశారు. పిఠాపురంలోనే స్థలం తీసుకుని ఇల్లు కట్టుకుంటానని తెలిపారు. మతాల సామరస్యతకు పిఠాపురం ఒక చిహ్నమని చెప్పారు. ఉదయం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి, సాయంత్రం జరిగిన జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళల సమావేశానికి తరలివచ్చిన వారికి భోజన సదుపాయం కల్పించిన గొల్లప్రోలు జనసేన సేవా సమితి ప్రతినిధులకు పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. సుమారు 10వేల మందికి భోజనాలు అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సమావేశంలో పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సమీక్షలతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బిజీబిజీ

టూర్ షెడ్యూల్ విడుదల

గొల్లప్రోలు రూరల్, జూలై 1: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం జరిపే టూర్ షెడ్యూల్‌ను ప్రకటించారు. 2వ తేదీ ఉదయం 9.30 గంటలకు గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసం నుంచి కాకినాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బయలుదేరుతారు. కలెక్టరేట్‌లో ఉదయం 10గంటలు నుంచి 11గంటల వరకూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులతో జరిగే సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో, 11.30 నుంచి 12 గంటల వరకూ రోడ్ కనెక్టవిటీపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో, మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకూ అటవీశాఖ అధికారులతో, ఒంటి గంట నుంచి 2 గంటల వరకూ రీజనల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో జరిగే సమావేశాల్లో పాల్గొంటారు. రాజమహేంద్రవరంలో నూతనంగా రీజనల్ సైన్స్ సెంటర్ ఏర్పాటుపై అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం అక్కడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు చేబ్రోలులోని నివాసానికి చేరుకుంటారు. భోజన విరామం అనంతరం జనసేన పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమావేశమవుతారు. రాత్రికి చేబ్రోలులోనే బసచేస్తారు.

కేన్సర్ స్క్రీనింగ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చాలి

ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు

రాజానగరం/రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 1: కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షను ఆరోగ్యశ్రీలో చేర్చే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని న్యూయార్క్‌లో కేన్సర్ అధ్యయన కేంద్రాన్ని నిర్వహిస్తున్న ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్టు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు కోరారు. డాక్టర్స్ డే సందర్భంగా రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రిని, రాజమహేంద్రవరంలోని కేన్సర్ ఆసుపత్రిని ఆయన సోమవారం సందర్శించారు. అనంతరం జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రిలో నెలకొల్పిన అంతర్జాతీయ ఫుడ్ సర్వీసుల సంస్థ సొడెక్సో శాఖాహార భోజన పథకాన్ని, కొత్తగా నెలకొల్పిన, అప్ గ్రేడ్ చేసిన మూడు కేన్సర్ చికిత్స యూనిట్లను డాక్టర్ నోరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్ నిర్మూలన అంటే జబ్బు వచ్చాక తగ్గించుకోవడం మాత్రమే కాదని ప్రజలు కేన్సర్‌పై అవగాహన పెంచుకోవడం, ఎప్పటికప్పుడు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవమే కేన్సర్ నిర్మూలనని చెప్పారు. కేన్సర్‌ను సకాలంలో గుర్తించి ఎప్పటికప్పుడు ట్రీట్మెంట్ తీసుకుంటే 98 శాతం కేసుల్లో ప్రాణాపాయం నుంచి బయటపడి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చన్నారు. జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ జీఎస్ఎల్ గ్రూపు సంస్థలు సబ్సిడీ పథకాన్ని ప్రారంభిస్తూ, జీఎస్ఎల్ ఆస్పత్రికి వచ్చే రోగులకు రూ.10కే భోజనం అందిస్తామన్నారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా రెండు దశాబ్దాలుగా జీఎస్ఎల్ సంస్థలో పనిచేస్తున్న దాదాపు 100 మంది వైద్యులు, ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బందిని ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కేన్సర్ ఆసుపత్రి డైరెక్టర్, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ తరుణ్ గోగినేని, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ వీవీ ఆనందరావు, సీఎస్ఎల్ సూపరింటెండెంట్ డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్, గన్ని కృష్ణ, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మ భోజనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

వివిధ సమస్యలపై 57 అర్జీలు

రంపచోడవరం జూలై 1: ప్రజా సమస్యలపై తక్షణం స్పందించి పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఐటీడీఏ ఏపీవో జనరల్ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. ఐటీడీఏ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం అధికారులు నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 57 అర్జీలు రాగా కొన్ని సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత శాఖలకు పంపించారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏడీఎంఅండ్‌హెచ్‌వో శిరీష, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

తాళ్లరేవు, జూలై 1: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం చొల్లంగి ఇందిరమ్మకాలనీకు చెందిన పిల్లి వినయ్(20) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు కోరింగ ఎస్‌ఐ రవికుమార్ సోమవారం తెలిపారు. ఇందిరమ్మకాలనీలో వినయ్ చిన్నాన్న ఇంటి నిర్మాణంలో భాగంగా వాటర్ డ్రమ్‌ను నింపేందుకు విద్యుత్ మోటారును సరిచేసే క్రమంలో ప్రమాదవశాత్తూ పిల్లి వినయ్ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. హుటాహుటిన వినయ్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకువెళ్లగా చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మన్యం ప్రాంతంలోని పోస్టులకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలి

మెగా డీఎస్సీతో స్థానిక అభ్యర్థులకు అన్యాయం

ఆదివాసీ సంక్షేమ పరిషత్ నేత మురళి

చింతూరు, జూలై 1: మన్యం ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు గాను స్థానిక అభ్యర్థులకు మాత్రమే వర్తించే విధంగా ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడె మురళి డిమాండ్ చేశారు. సోమవారం చింతూరులో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీలో మన్యం పోస్టుల భర్తీని కూడా కలిపేయడం వల్ల స్థానిక డీఎస్సీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. నాయకులు పులి వీరయ్య, పైదా ముత్తయ్య, తుర్రం రమేష్, సోడె సత్యనారాయణ పాల్గొన్నారు.

గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని నాశనం చేశారు..

రాష్ట్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం

దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి ప్రత్యేక ప్రణాళిక

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

పెరవలి, జూలై 1: గత ఐదేళ్లలో రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిలా మారిందని, పోలవరం ప్రాజెక్టు నాశనం చేయడంతో పాటు అమరావతిని కూడా రూపురేఖలు మార్చి వేశారని, రాష్ట్రంలో అభివృద్ధి కుంటు పడి రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ విమర్శించారు. పింఛన్ల పంపిణీ నిమిత్తం పెరవలి మండలం తీపర్రు వచ్చిన ఆయన కొద్దిసేపు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఖజానాను జగన్ ప్రభుత్వం ఖాళీ చేయడంతో ప్రస్తుతం ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలంటే కష్టతరంగా మారిందన్నారు. రాష్ట్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. కడియం నర్సరీలను అభివృద్ధి చేయడం ద్వారా టూరిజం, వివిధ ఆలయాలను అభివృద్ధి చేయడం ద్వారా టెంపుల్ టూరిజం, ప్రకృతి ప్రదేశాలు అభివృద్ధి చేయడం ద్వారా హెరిటేజ్ టూరిజం అభివృద్ధి చేస్తామని దుర్గేష్ పేర్కొన్నారు. విశాఖపట్టణం, తిరుపతి పరిసర ప్రాంతాల్లో టూరిజం బాగా అభివృద్ధి చెందుతోందని, రాజమహేంద్రవరంలో హేవలాక్ బ్రిడ్జిని అభివృద్ధి చేసి పిచ్చుకలలంక పరిసర ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని నామినేటెడ్ పోస్టులన్నీ రద్దు చేశారని, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులను టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి సమన్వయంతో ఎంపిక చేసి ఆ పోస్టుల్లో నియమిస్తామని, దానికి ఇంకా సమయం ఉందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, అతికాల శ్రీను, పిప్పర రవి, ప్రత్తిపాటి ప్రసాద్‌కుమార్, మొగళ్లపు సీతారాం, ప్రత్తిపాటి వీరభద్రకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

యానాం, జూలై 1: స్థానిక సీగల్స్‌లో సోమవారం యానాం మహాత్మాగాంధీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఎస్‌టీపీపీ జూనియర్ కళాశాలలో 1978-81లో పది, ఇంటర్ చదివిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఇటీవల వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పూర్వ విద్యార్థులు అనిమిల్లి సత్యనారాయణ, వేమూరి విజయ్‌కుమార్, దంగేటి త్రిమూర్తులు, గొకవరపు వీరేశ్వరరావులను పూర్వ విద్యార్థులు సత్కరించారు. యానాం పబ్లిక్ స్కూల్‌లో పేద విద్యార్థిని ఎస్.అమృతవర్షిణికి రూ.10వేలు ఫీజులు కోసం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తొత్తరమూడి వెంకటేశ్వరరావు (విశ్రాంతి ఎస్పీ సీఐఎఫ్ఎస్), గూటం శివగణేష్ (విశ్రాంతి సీఐ), పోలిమారి సత్యనారాయణ(విశ్రాంతి మేనేజర్ ఇండియన్ బ్యాంక్), కమిడి విజయ్‌కుమార్, కముజు సూరిబాబు(ప్రముఖ న్యాయవాది) పాల్గొన్నారు.

రోడ్‌కంరైలు బ్రిడ్జిపై స్తంభించిన ట్రాఫిక్



కొవ్వూరు, జూలై 1: కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. సోమవారం ఉదయం 9-30 గంటల నుంచి 11 గంటల మధ్యలో రోడ్డు కం రైలు బ్రిడ్జిపై కొవ్వూరు టోల్ గేట్ వద్ద గడ్డర్ల సమీపంలో ఏలూరు డిపో బస్సు మొరాయించింది. అదే సమయంలో కొవ్వూరు వైపు బ్రిడ్జిపై మలుపులో మరో బస్సు మొరాయించి నిలిచిపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. కళాశాలలు, కార్యాలయాలకు వెళ్లే సమయం కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం తెలుసుకున్న రాజమహేంద్రవరం, కొవ్వూరు పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మొరాయించిన బస్సులను ప్రయాణికులు పక్కకు నెట్టారు.



బస్సును తోస్తున్న ప్రయాణికులు

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి



కోటనందూరు, జూలై 1: కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కేఈ చిన్నయ్యపాలెం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం...అనకాపల్లి జిల్లా నాతవరం మండలం వీకే గూడెం గ్రామానికి చెందిన కొమ్ము సూర్యనారాయణ (45) రౌతులపూడి మండలం రాజవరం నుంచి మోటార్ సైకిల్‌పై తిరిగి వస్తుండగా మరో మోటార్ బైక్‌పై కోటనందూరు మండలం అల్లిపూడి నుంచి కేఈ చిన్నయ్యపాలెం వైపు వెళుతున్న మోటార్‌బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో సూర్యనారాయణ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో మోటార్ బైక్‌పై ఉన్న నేలపాటి అప్పలకొండ, మార్తి రాజుకు గాయాలు కావడంతో 108లో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని స్థానిక పోలీసులు తెలిపారు.

డాక్టర్స్ డే వేడుకలు

అమలాపురంరూరల్, జూలై1: స్థానిక కిమ్స్ వైద్య కళాశాలలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కిమ్స్ డీన్ డాక్టర్ ఆనంద్ఆచార్య ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుబ్బారావు, మెడికల్ డైరెక్టర్ పి.హరికిరణ్‌వర్మపాల్గొన్నారు. వైద్యులకు విద్యా సంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు, ఎండీ కె.రవికిరణ్‌వర్మ శుభాకాంక్షలు తెలిపారు. దంతకళాశాలలో ప్రిన్సిపాల్ శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జేఎంవీ కేవీఎస్ పవిత్ర, డైరెక్టర్ పి.రాజాశ్యామల పాల్గొన్నారు.

- ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు
- పండుగలా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ
- చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

నిజమైన సంక్షేమం టీడీపీతోనే సాధ్యం







ముమ్మిడివరం: పల్లిపాలెంలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే సుబ్బరాజు, రాయవరం: మాచవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, అయినవిల్లి:అయినవిల్లిలో పింఛన్ పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ , ఉప్పలగుప్తం: గొల్లవిల్లిలో పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, రాజోలు:శివకోటిలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

ముమ్మిడివరం, జూలై 1: పేద ప్రజలకు నిజమైన సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే జరిగిందని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. నగర పంచాయతీ 3వ వార్డు పల్లిపాలెంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు ఎమ్మెల్యే పాలాభిషేకం చేసి పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. సూపర్-6 హామీల్లో పెంచిన పింఛన్లు పంపిణీచేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేన్నారు. సీహెచ్.గున్నేపల్లిలో ఎమ్మెల్యే పింఛను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో రూ.28కోట్లు 42వేల మందికి పింఛన్లు పంపిణీ చేశారన్నారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ బి.శ్రీనునాయక్, నాయకులు గుత్తుల సాయి, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, పొద్దోకు నారాయణరావు,త ఆడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, అర్ధాని శ్రీనివాసరావు, ములపర్తి బాలకృష్ణ, చిక్కాల అంజిబాబు, అడబాల సతీష్‌కుమార్, దూడల స్వామినాయుడు, గోదశి పుండరీష్, యాళ్ల ఉదయ్, పిల్లి నాగరాజు, గొల్లపల్లి గోపి, దాట్ల బాబు, గాలిదేవర బుల్లి, గొల్లపూడి తాతాజీ, గీసాల చంద్రరావు, రంకిరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తెల్లవారుజామున 3 గంటలకు:

మర్లపాలెం పంచాయతీ పరిధిలో తెల్లవారుజామున 3 గంటలకు దివ్యాంగుడు కుంచే శ్రీనివాసరావుకు రూ.6వేలు మొట్టమొదటిగా పింఛను టీడీపీ నాయకులు అందించి రికార్డు సృష్టించారు. రాణేలంక పంచాయతీ బూరుగులంకలో నూరు శాతం దివ్యాంగురాలు చింతలపూడి సత్యవతికి టీడీపీ నాయకులు అర్ధాని శ్రీనివాసరావు, దంగేటి శ్రీనివాసరావు, బొక్కా సత్తిబాబు పింఛను అందజేశారు.

పండుగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ

అమలాపురం టౌన్/రూరల్, జూలై 1: అమలాపురం పట్టణంతో పాటు మండల పరిధిలోని ఈదరపల్లి, నడిపూడి, బండారులంక, భట్నవిల్లి తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పెన్షన్లు పంపిణీ చేశారు. బండారులంక, పంచాయతీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహం ఎదుట సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పెన్షను లబ్ధిదారుల సమక్షంలో పాలాభిషేకం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు మెట్ల రమణబాబు, పెచ్చెట్టి విజయలక్ష్మి, చింతా శంకరమూర్తి, మల్లులపోలయ్య, దెందుకూరి సత్తిబాబురాజు, మాడా మాధవి, మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, బొర్రా ఈశ్వరరావు, పిచ్చిక శ్యామ్, సర్పంచ్ పెనుమాల సునీత తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, జూలై1:ఆలమూరులో బి.వెంకటరమణ ఇంటికి వెళ్లి మంచం మీదే వున్న ఆయనకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పింఛను పంపిణీ చేశారు. పూర్తి దివ్యాంగ పింఛను ఎందుకు రావట్లేదని ఆరా తీశారు. తక్షణం అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొత్తపేట ఆర్డీవో సత్యనారాయణ, తహసీల్దారు అనిల్‌కుమార్, ఎంపీడీవో మేరీరోజ్, నాయకులు బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ, బండారు సంజీవ్ పాల్గొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మండలంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

పెన్షన్ల పంపిణీ

ఉప్పలగుప్తం, జూలై 1: భీమనపల్లి, గొల్లవిల్లి, చల్లపల్లి, కూనవరం గ్రామాల్లో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, ఆర్డీవో కేశవర్ధనరెడ్డి, తహసీల్దారు మల్లికార్జునరావు, ఎంపీడీవో కె.వెంకటేశ్వరప్రసాద్, ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి, కూటమి నాయకులు గొలకోటి చిన్నా, ఆకేటి పెద్ద, నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, బూసి బుజ్జిదొర, ఆకుల సూర్యనారాయణమూర్తి, అడబాల సత్యనారాయణ, చీకట్ల ఏసు, గొలకోటి సత్తిరాజు, మద్దింశెట్టి సీతారామస్వామి, చిక్కం ఉమేష్, నందుల సత్తిరాజు, నాగిరెడ్డి సత్తిబాబు, పిల్లా బుజ్జి, మంచెం బాలకృష్ణ, సలాది శ్రీనివాసరావు, చిక్కం సూర్యమోహన్, చిక్కం కాసు, గుత్తాల సుభాష్‌చంద్రరావు, సర్పంచ్‌లు జొన్నాడ శ్రీదుర్గాచిన్ని, పెయ్యల రాజ్‌కుమార్, చిక్కం జంగమయ్య, వాకపల్లి ఈశ్వరీసత్యనారాయణ, ఇసుకపట్ల జయమణీరఘుబాబు, జోగి రాజేశ్వరీరాజా తదితరులు పాల్గొన్నారు.

పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు

పి.గన్నవరం, జూలై 1: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు రూ.7వేలకు పెంచి పంపిణీ చేసిన కూటమి ప్రభుత్వం నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, కూటమి నేతలతో కలిసి పి.గన్నవరం, బెల్లంపూడి గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. లంకలగన్నవరంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు కూటమి నేతలతో కలిసి ఫించన్లు పంపిణీ చేశారు. వివిధగ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి నేతలు పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో సాయంత్రం 5గంటలకు 92శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి తెలిపారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, తహశీల్దార్ ఎస్‌కే హుస్సేన్, కూటమి నేతలు దాసరి వీరవెంకటసత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, సర్పంచ్ బొండాడ నాగమణి, యర్రాప్రగడ స్వర్ణలత, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, యడ్ల ఏసు, పెదపూడి రాము, పెచ్చెట్టి ఈశ్వర్, కర్రి బాబురావు, తాటికాయల శ్రీనివాసరావు, నల్లా పెద్దకాపు పాల్గొన్నారు.

పింఛనుదారుల ముఖాల్లో వెలుగులు

రామచంద్రపురం/ద్రాక్షారామ, జూలై 1: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సోమవారం రామచంద్రపురం పట్టణం, మండలంలో పండుగలా జరిగింది. రామచంద్రపురం పట్టణం ముచ్చుమిల్లిలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్ పింఛన్లు పంపిణీ చేశారు. గుబ్బలవారిపేటలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కట్టా నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ దంగేటి గౌరీశంకర్, శీలంవారిసావరంలో మేడిశెట్టి సూర్యనారాయణ, మేడిశెట్టి శేషారావు, కౌన్సిలర్ మేడిశెట్టి వెంకటలక్ష్మీ పింఛన్లు పంపిణీలో పాల్గొన్నారు. అంబికపల్లి అగ్రహారంలో తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. మాజీ ఎంపీటీసీ విత్తనాల వెంకటరమణ, నిమ్మగడ్డ విజయ్ పింఛన్లు పంపిణీ చేశారు. ద్రాక్షారామలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, క్లస్టర్ ఇన్‌చార్జి పెంకే సాంబశివరావు పింఛన్లు పంపిణీ చేశారు. అక్కడ చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తోటపేటలో చోడిశెట్టి శివాజీ, శీలం వీరభద్రరావు ఆధ్వర్యంలో చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. వెలంపాలెంలో టేకుమూడి సుజాత సత్యనారాయణ ఆధ్వర్యంలో పింఛన్‌దారులు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఉండూరులో సర్పంచ్ చిగురుపాటి రామలక్ష్మీ, చిగురుపాటిసాయిరాం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

ఉదయం నుంచే పింఛన్ల పంపిణీపై ఆనందం

అంతర్వేది, జూలై 1: లబ్ధిదారులకు ఉదయం నుంచే పింఛన్లు అందివ్వడం చాలా ఆనందంగా ఉందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సోమవారం సఖినేటిపల్లిలంకలో ఎమ్మెల్యే వరప్రసాద్ పలువురికి పింఛన్లు పంపిణీ చేశారు. సఖినేటిపల్లి, మోరిపోడు తదితర గ్రామాల్లో నాయకులతో కలిసి వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు. మోరిపోడులో ఎమ్మెల్యే వరప్రసాద్ ద్విచక్ర వాహనంపై పర్యటించి పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. మండలంలోని గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి శ్రేణులు, సచివాలయ, వివిధ శాఖల అధికారులతో ఉత్సాహంగా పింఛన్లు పంపిణీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, ఆర్ఐ రామరాజు, వీఆర్వోల సంఘ అధ్యక్షుడు బి.సీతారాం, సర్పంచ్‌లు రేపూరి రాజేశ్వరి, పోతురాజు నరసింహారావు (కిశోర్), మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, గుండుబోగుల పెద్దకాపు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, ముప్పర్తి నాని పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

అయినవిల్లి, జూలై 1: పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. అయినవిల్లిలో లబ్ధిదారులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. పలు గ్రామాల్లో నిర్వహించిన పెన్షన్ల పంపిణీలో సర్పంచ్‌ల కాకర శ్రీనివాస్, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, మద్దాల సుబ్బారావు, సలాది బుచ్చిరాజు, మేడిద దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణం

మలికిపురం, జూలై 1: పింఛన్ల పంపిణీతో పండుగ వాతావరణం నెలకొందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. పెంచిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. రామరాజులంక, విశ్వేశ్వరాయపురం, మోరిపోడు గ్రామాల్లో ఇంటింటా తిరిగి అందజేశారు. ఒకటో తేదీనే ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో పాటు ఉద్యోగస్తులు కూడా జీతాలు వారి అక్కౌంట్లలో జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, గుండుబోగుల పెదకాపు, పినిశెట్టి బుజ్జి, అడబాల యుగంధర్, నిమ్మగడ్డ బాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పండుగలా పింఛన్ల పంపిణీ

అంబాజీపేట, జూలై 1: మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం పండుగగా నిర్వహించారు. మండలంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు వేకువజాము నుంచి పింఛన్లదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మాచవరం పంచాయతీ కార్యాలయం వద్ద పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ లబ్ధిదారులకు పింఛన్ అందించారు. అనంతరం పలువురి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, నియోజకవర్గ కన్వీనర్, కోకన్వీనర్లు నామన రాంబాబు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, నాయకులు గణపతి వీరరాఘవులు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, చిన్నం బాలవిజయరావు, కొర్లపాటి గోపి, వాసంశెట్టి వరలక్ష్మి చినబాబు, దంతులూరి శ్రీనురాజు, దొమ్మేటి సాయికృష్ణ, గుడాల ఫణి, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి జీజీవీకే కుమార్ తదితరులు పాల్గొన్నారు.

95శాతం పంపిణీ

రాయవరం, జూలై1: 12గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పసలపూడి, మాచవరంగ్రామాల్లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 10,242మంది పింఛన్‌దారులు ఉండగా 9,563మందికి (95శాతం)పింఛన్లు అందజేశామని ఎంపీడీవో తెలిపారు. లబ్ధిదారుల ఇంటింటికి సచివాలయ సిబ్బంది, అధికారులు వెళ్లి పింఛన్లు అందజేశారు. తహశీల్దారు కృష్ణారావు, ఏవో కె.ప్రభాకర్, అధికారులు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన ఘనత చంద్రబాబుకే

కపిలేశ్వరపురం, జూలై 1: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం చంద్రబాబుకే సాధ్యమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణలు అన్నారు. సోమవారం కాలేరులో ఎమ్మెల్యే వేగుళ్ళ, వల్లూరు, అంగరలో లీలాకృష్ణ పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీ పండుగలా సాగడంతో పేదల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. కపిలేశ్వరపురం, అంగర, కోరుమిల్లి తదితర గ్రామాల్లో కూటమి నాయకులు పెన్షన్లను అధికారులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మండల ప్రత్యేకాధికారి శాంతి, ఎంపీడీవో కొండలరావు, కార్యదర్శి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డి.రావులపాలెంలో పంపిణీ

అల్లవరం, జూలై1: డి.రావులపాలెం, దేవగుప్తం, యెంట్రుకోన, అల్లవరం, కోడూరుపాడు గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, ఎంపీడీవో కృష్ణమోహన్, తహసీల్దారు సునీల్ కుమార్, ఆకుల లక్ష్మణరావు, వేగిరాజు వెంకట్రాజు, తోలేటి నానాజీ, సర్పంచ్‌లు నడింపల్లి సుబ్బరాజు, ఉంద్రు భగవాన్ దాస్, సాధనాల వెంకట్రావు, తిక్కిరెడ్డి శ్రీనివాస్, బొమ్ము బాలవేణి, ఎంపీటీసీలు ఎన్.మౌనిక, ఎం.రాంబాబు, గుబ్బల రాంప్రసాద్, పోతుల నాగరాజు, కంకిపాటి వీరబాబు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన నాయకుడు చంద్రబాబు

రాజోలు, జూలై 1: దేశంలో ఒక చరిత్ర సృష్టించిన నాయకుడు సీఎం చంద్రబాబునాయుడు అని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శివకోటిలో 18 ఎకరాల కాలనీలో సోమవారం లబ్ధిదారులకు ఆయన పింఛన్లు అందజేశారు. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్, మే, జూన్ నెలల పెండింగ్, జూలై రూ.4వేలతో పాటు రూ.7వేలు పింఛను లబ్ధిదారులకు అందజేశామన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు చిత్రపటానికి ఆయన పాలాభిషేకం చేశారు. తాటిపాకలో పెన్షన్ ఎంపీపీ కేతా శ్రీను పంపిణీ చేశారు. పొదలాడ, చింతపల్లి, కూనవరంతో పాటు ఆయా గ్రామాల్లో పెన్షన్లు పంపిణీ చేశారు. కడలిలో తెల్లవారుజామున 4.30గంటలకు రాజోలు నియోజకవర్గ టీడీపీ రైతు ఉపాధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు, జనసేన, బీజేపీ నాయకులు లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు. రాజోలులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద సీఎం చంద్రబాబు చిత్రపటానికి పెన్షన్‌దారులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగంరాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకరమణ, టీడీపీ, జనసేన పార్టీల మండల అధ్యక్షులు గుబ్బల శ్రీనివాస్, సూరిశెట్టి శ్రీనివాస్, రుద్ర పద్మరాజు, చిటికెల రామ్మోహనరావు, చాగంటి స్వామి, సర్పంచ్ కడలి సత్యనారాయణ, కాండ్రేగుల సత్యనారాయణమూర్తి, కడలి నారాయణమూర్తి, మానుకొండ దుర్గాప్రసాద్, కాండ్రేగుల కృష్ణ, పిప్పళ్ల రాంబాబు, అడబాల విజయ్, రావి మురళీ, ఆరుమిల్లి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకులతో కలిసి

కొత్తపేట, జూలై 1: వాడపాలెం శ్రీనివాసపేటలో కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీవో డి.రాంబాబు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, నాయకులు ధర్నాల రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మి భాస్కరరావు, యల్లమిల్లి జగన్మోహన్, సత్తిరాజు ఉషారాణి, పల్లి శాంతి, బూసి విష్ణుమూర్తి, గుబ్బల మూర్తి, ఎంపీడీవో కె.వాణి పాల్గొన్నారు.

ప్రజలకు సంక్షేమ పండుగలు ప్రారంభం

మండపేట, జూలై1: ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రజలకు సంక్షేమ పండుగలు ప్రారంభమయ్యాయని, ఐదేళ్ల తరువాత పింఛన్‌దారుల కళ్లలో ఆనందం నింపిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరావు అన్నారు. సోమవారం మండలంలోని గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వంలో పింఛన్లు పెంచుకుంటూ పోతామని నమ్మించి ఐదేళ్లు జగన్ పేదలను మోసగించారన్నారు. ఎన్నికల హామీలను నెరవేరుస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నేతలుపాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

ఐ.పోలవరం, జూలై1: మూడు నెలలకు మూడువేలు కలిపి జూలైలో రూ.7,000 పింఛన్ అందించిన చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. సోమవారం మురమళ్ళలో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. జంపన బాబు, దాట్ల రామకృష్ణంరాజు, కఠారి నాని, చెయ్యేటి శ్రీనుబాబు, ఏలూరి మూర్తి, ఉప్పు వాసు, గంజా సుధాకర్ పాల్గొన్నారు. గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులుపాల్గొన్నారు.

పెన్షన్లు పంపిణీ

రావులపాలెం, జూలై1: రావులపాలెంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పెన్షన్లు పంపిణీ చేశారు. జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, టీడీపీ నాయకుడు ఆకుల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, యువ నాయకుడు బండారు సంజీవ్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

ఆత్రేయపురం, జూలై 1: ఆత్రేయపురం, మెర్లపాలెంలో గ్రామాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పింఛన్లు పంపిణీ చేశారు. ఆత్రేయపురంలో వృద్ధుడికి పింఛను అందజేశారు. జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, సర్పంచ్‌లు గెడ్డం సుధ, మెర్ల రాము పాల్గొన్నారు. పింఛన్ల పంపిణీని ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, సిబ్బంది పర్యవేక్షించారు.






అమలాపురం: చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, కపిలేశ్వరపురం: వల్లూరులో వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న వేగుళ్ల లీలాకృష్ణ, ఆత్రేయపురం: ఆత్రేయపురంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు, ద్రాక్షారామ: ముచ్చుమిల్లిలో దివ్యాంగురాలికి పింఛను పంపిణీచేస్తున్న జనసేన ఇన్‌చార్జి చంద్రశేఖర్

ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలి

మలికిపురం, జూలై 1: రాజోలు నియోజకవర్గంలో ప్రతీరోజు ప్రతీ ఇంటికీ తాగునీరు అందించాలనే లక్ష్యాన్ని అధికారులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఎల్ఎస్ ల్యాండ్ మార్క్ వద్ద ఆర్‌డబ్ల్యుఎస్ చీఫ్ ఇంజనీర్ టి.గాయత్రిదేవితో సమీక్ష జరిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 220 శివారు గ్రామాలకు నిరంతరం తాగునీరు అందించడానికి అధికారులు రూ.10కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. కలెక్టర్‌తో మాట్లాడగా జీఎస్సార్ నిధుల నుంచి రూ.5కోట్లు ఇవ్వడానికి అంగీకరించారని, ఇప్పటికే మంజూరైన రూ.5కోట్ల నిధులతో మట్టపర్రులో పనులు చేపట్టడానికి ముందుకు వెళ్లనున్నట్టు ఆయన తెలిపారు. తాగునీరు సక్రమంగా అందించడానికి మలికిపురం, రామరాజులంక, లక్కవరం ప్రాంతాలకు ప్రత్యేక పైపులైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ చీఫ్ ఇంజనీర్ గాయత్రీదేవి మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ముందుకు వెళతామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికీ నీటి వసతి కల్పిస్తామని, ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. గత ప్రభుత్వంలో నిధుల కొరతతో పనులు ముందుకు వెళ్లలేదని, జలజీవన్‌మిషన్ ద్వారా సమస్యను అధిగమిస్తామన్నారు. ఈసమీక్షలో డీఈఈలు రాజన్, శ్రీనివాసరావు, ఈఈ సురేష్, గుండుబోగుల పెదకాపు, పినిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

నూతన క్రిమినల్ చట్టాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

అమలాపురం టౌన్, జూలై 1: నూతనంగా కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన క్రిమినల్ చట్టాలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నాయని అమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరిన సాయిరామ్ విమర్శించారు. నూతన చట్టాల అమలును నిరసిస్తూ న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. నూతన చట్టాలను రద్దు చేయాలని నినాదాలు చేశారు. నూతన చట్టాల కారణంగా పోలీసులకు అపరిమితమైన అధికారులు ఇవ్వబడతాయని, సీనియర్ న్యాయవాది ఎండీ ఆజామ్ పేర్కొన్నారు. లా కమిషన్ రూపొందించాల్సిన చట్టాలను మినిస్ట్రీ ఆఫ్ హోం ఎఫైర్స్ రూపొందించడం నిబంధనలకు వ్యతిరేకమని న్యాయవాది బడుగు భాస్కర జోగేష్ ఆరోపించారు. ప్రధాన కార్యదర్శి నందెపు శ్రీనివాస్, కళా వెంకట్రావు, ఎస్వీ సూర్యనారాయణ, కుడుపూడి అశోక్, కె.సత్యనారాయణ, బీర వెంకట్రావు, సీహెచ్ అజయ్‌కుమార్, నందెపు చినవెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన

యానాం, జూలై 1: కేంద్ర ప్రభుత్వం సీఆర్‌పీసీ చట్టాలను సవరించి దేశవ్యాప్తంగా అమల్లోకి తెస్తున్న నేపథ్యంలో నూతన చట్టాలపై యానాం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమావేశం హాలులో ఎస్ఐ మురుగానందన్ అధ్యతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్పీ రాజశేఖరన్, విశిష్ట అతిథిగా ఏపీపీ సలాది దుర్గ శ్రీనివాస్, సీఐ షణ్ముగం పాల్గొన్నారు. కార్యక్రమ విశిష్టతను ఉపాధ్యాయుడు హంసాని రామలక్ష్మణుడు వివరించారు. నూతన చట్టాలపై ఎస్పీ రాజశేఖరన్, యానాం సబ్‌కోర్టు ఏపీపీ సలాది దుర్గశ్రీనివాస్ వివరించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, న్యాయవాది కమిడి విజయ్‌కుమార్, గుత్తుల గోవింద జయరామారావు, గూటం శివగణేష్, కొండమూరి శ్రీహరి, వివిధసంఘాలు పాల్గొన్నారు.

నవంబరు కల్లా పనులు పూర్తి

అంతర్వేది, జూలై 1: అంతర్వేది దేవస్థానం గ్రామంలో రూ.17.88కోట్లతో జరుగుతున్న మంచినీటి చెరువు పనులను ఆర్‌డబ్ల్యుఎస్ చీఫ్ ఇంజనీర్ టి.గాయత్రీదేవి సోమవారం పరిశీలించారు. నవంబరు నాటికల్లా మంచినీటి చెరువు పనులు పూర్తవుతాయని, 4గ్రామాల ప్రజల దాహార్తిని ఈమంచినీటి చెరువు తీరుస్తుందన్నారు. మంచినీటి చెరువు చుట్టూ కాంక్రీటు వాల్, చెరువుకు సమీపంలో సంపు నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. డీఈ రాజన్, ఎంపీటీసీ బైరా నాగరాజు, మాజీ ఎంపీటీసీ మందపాటి వెంకటేశ్వర్లు, శంకరగుప్తం కొండ, శంకరగుప్తం నాని, అయినపర్తి ఏసు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గం

ద్రాక్షారామ, జూలై 1: పీఆర్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా పి.గన్నవరం మండలం పాతగన్నవరం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు దీపాటి సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా రామచంద్రపురం మండలం నరవత్నాల గరువు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వాడ్రేవు శ్రీనివాస్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్ ప్రకటించారు.

మంత్రి సుభాష్‌ను కలిసిన ఎమ్మెల్సీ ఐవీ

రామచంద్రపురం(ద్రాక్షారామ),జూలై1: మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను సోమవారం ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పూలమొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. యూటీఎఫ్ నాయకులు మంత్రిని కలిశారు. సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

ఎంపీడీవోగా మల్లికార్జునరావు

అమలాపురం రూరల్, జూలై 1: అమలాపురం ఎంపీడీవోగా జి.మల్లికార్జునరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన్ను పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా శాఖ నాయకులు రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, కోడూరి వెంకటేశ్వరరావు, పరంశెట్టి ఆదినారాయణ, పరంశెట్టి శ్రీనివాస్, మండల పరిషత్ సిబ్బంది తదితరులు అభినందించారు.

ఫ్లెక్సీల చించివేతపై కేసు నమోదు

అమలాపురం రూరల్, జూలై 1: కామనగరువు శివారు బీవీ రమణయ్య కాలనీలో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి టీడీపీకి చెందిన ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు. టీడీపీ శ్రేణులు అక్కడకు చేరుకుని తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వై.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మాజీ మంత్రి వేణుకు మాతృ వియోగం



రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 1: మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు సోమవారం మాతృవియోగం కలిగింది. వేణు మాతృమూర్తి సుబ్రహ్మణ్యం(94) రామచంద్రపురంలో వేణు స్వగృహంలో మృతిచెందారు. ఏపీఐడీసీ డైరెక్టరు వాసంశెట్టి శ్యామ్, ఎంపీపీలు పంపన నాగమణి, అంబటి భవానీ, శెట్టిబలిజ సంఘం నాయకులు కట్టా సూర్యనారాయణ, నరాల ఏడుకొండలు, వైస్ ఎంపీపీలు శాకాబాబీ, నరాల రాజ్యలక్ష్మీ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సుబ్రహ్మణ్యం భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మంగళవారం రాజమహేంద్రవరంలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

పింఛన్ పెంపుపై దివ్యాంగుల హర్షం

ముమ్మిడివరం, జూలై 1: దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం పింఛన్ రూ.6వేలకు పెంచడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక పోలమ్మ చెరువుగట్టున ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండల కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా ఆకుమర్తి సాయికృష్ణ, గౌరవాధ్యక్షుడిగా ఖండవల్లి ఏలియా, ఉపాధ్యక్షుడిగా కాతేటి సజ్జనరాజు, కార్యదర్శి లంక శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా చాట్ల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా బొమ్మి హరికృష్ణ, ఎమ్మెస్పీ మండల కమిటీ అధ్యక్షుడిగా ఉండ్రాజవరపు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడిగా అయినవిల్లి సూర్యారావు, కార్యదర్శిగా మడికి సత్యనారాయణలతో కమిటీ ఏర్పాటైంది. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నవరపు భైరవమూర్తి, ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు వీధి చిరంజీవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అయినవిల్లి వలీబాబా,బడుగు సాయి, తొత్తరమూడి జ్యోతిబాబు, బొమ్మి రామకృష్ణ, చుట్టుగుళ్ల అన్నవరం, ఉందుర్తి ప్రకాశరావు, మట్ట వెంకటేశ్వరరావు, ముమ్మిడివరపు రాజేష్, మట్ట శ్రీనివాసరావు, బండారు నాగేశ్వరరావు, సంసాని నాగరాజు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

ముమ్మిడివరం, జూలై 1: పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని నక్కావారిపేటలోని కుంచే చిరంజీవి(34)కి కొంత కాలం క్రితం పుష్పతో వివాహమైంది. పుష్ప ఇటీవల కువైట్ వెళ్లింది. ఆమె పంపిన సొమ్ములను విచ్చలవిడిగా ఖర్చు చేయడంతో చిరంజీవికి, పుష్పకు మాటామాటా పెరగడంతో శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఏఎస్ఐ ఎస్.జాన్‌బాబు కేసు దర్యాప్తు చేపట్టారు.

కొత్త చట్టాలకు రూపునిచ్చిన విద్యార్థులు



అమలాపురం రూరల్, జూలై 1: నూతనంగా అమలులోకి వచ్చిన కొత్త చట్టాలపై అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు ఆధ్వర్యంలో కామనగరువు ఆదిత్య పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు కొత్త చట్టాల ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు. తాలూకా సీఐ పి.వీరబాబు, ఎస్ఐ వై.శేఖర్‌బాబు, ప్రిన్సిపాల్ రామ్‌ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ చలపతిరావు, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

కొత్తపేట, జూలై 1: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ కళాశాల డిగ్రీ విద్యార్థులు గనిశెట్టి రామకృష్ణమోహనశంకర్, కొల్లాటి జాయిషి సెంట్రల్ యూనివర్సిటీ పీజీ ఎంట్రన్స్ టెస్ట్‌లో కెమిస్ట్రీలో 6, 7 ర్యాంకులు సాధించారు. యూనివర్సిటీ ఆఫ్ కేరళలో ఎమ్మెస్సీ చదివేందుకు కేరళ వెళ్తున్నారు. సోమవారం వారిని ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ.1.16లక్షల విరాళం

ఆత్రేయపురం, జూలై 1: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన గ్రంధి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.1,11,600 విరాళం సమర్పించారు.

వివాహిత అదృశ్యంపై కేసు

అమలాపురం రూరల్, జూలై 1: బండారులంక పేరివారి కాలనీకి చెందిన కొండా నాగలక్ష్మీపార్వతి(35) గత నెల 28వ తేదీ రాత్రి నుంచి కనిపించట్లేదని భర్త సూర్యారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తాలూకాఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు9440796562 నెంబరుకు సమాచారం అందించాలన్నారు. పార్వతి అదృశ్యంపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆమె మొబైల్ స్విచాఫ్‌లో ఉంది. కాల్ డేటా సేకరించి అదృశ్యం వెనుక మిస్టరీని ఛేదించే పనిలో పోలీసులు ఉన్నారు.